క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: కిలో రూపాయల్లో.. టమాటా.15, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 14, క్యారెట్ 40, దొండ 18, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 31, మొరంగడ్డ 18, కందగడ్డ 55, సొరకాయ 7, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అస్సాం సీఎంకు ఘన స్వాగతం



అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మతో సెల్ఫీలు దిగుతున్న యువకులు

సనత్‌నగర్: హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనేందుకు ఆదివారం బేగంపేట విమానాశ్రయానికి అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో అస్సాం నుంచి బేగంపేటకు మధ్యాహ్నం 3.15 గంటలకు చేరుకున్న హిమంత బిశ్వ శర్మ విమానం దిగి 10 నిమిషాల పాటు బయట వేచి ఉన్న కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం ముఖ్య నేతలతో మాట్లాడిన హిమంత బిశ్వ శర్మ అక్కడి నుంచే 3.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో కరీంనగర్ తరలివెళ్లారు.

కొత్త కోర్సులు సరే.. బోధకులేరీ..?

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నాలుగు యూనివర్సిటీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ, పీజీ డిప్లొమాలలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. కానీ బోధనకు ఇప్పటికే విద్యార్థులు తీవ్రమైన అధ్యాపకుల కొరత ఎదుర్కొంటున్న తరుణంలో కొత్త కోర్సులను ఎవరు బోధిస్తారని విద్యార్థి నాయకులు రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఓయూలో ఎమ్మెస్సీ పార్మంటాలజీ సైన్స్, కాకతీయ వర్సిటీలో ఎమ్మెస్సీ సెరికల్చర్ (పట్టు పురుగుల పెంపకం), తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో ఫ్యామిలీ మ్యారేజీ కౌన్సెలింగ్ తదితర పీజీ, డిప్లొమా కోర్సులు ఇదివరకు రాష్ట్రంలో ఎక్కడ కొనసాగడం లేదు. ఇలాంటి సబ్జెక్టులను బోధించుటకు అధ్యాపకులను ఎక్కడి నుంచి తీసుకొస్తారని విద్యార్థి నేతలు ప్రశ్నిస్తున్నారు. అధ్యాపకులను నియమించాకే వివిధ కొత్త కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వాసవీ డ్రీమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జకీర్

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని వాసవీ డ్రీమ్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జకీర్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జయబాబు, కోశాధికారిగా రామమోహనరావు ఎన్నికయ్యారు. వాసవీ డ్రీమ్స్ అపార్ట్‌మెంట్ నివాసితుల సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



సార్థక్ లాంబా

సనత్‌నగర్: ఐసీఎస్ఈ, ఐఎస్ఈ ఫలితాల్లో బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రెండు పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌పీఎస్ ప్రతినిధులు తెలిపారు. ఐసీఎస్ఈ ఫలితాల్లో హెచ్‌సీజీ (హిస్టరి, సివిక్స్, జియోగ్రఫీ), గణితం, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పాఠశాలకు చెందిన సార్థక్ లాంబా 600 మార్కులకు గాను 594 మార్కులు (99 శాతం) సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడని చెప్పారు. ఆ తరువాతి స్థానంలో ఆద్య కొల్లిపర (98.8శాతం) నిలిచిందన్నారు. 81 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారని వారిలో 30 శాతం మంది 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారని తెలిపారు. ఐఎస్‌సీ ఫలితాల్లో బాలికల బృందం ముందంజలో ఉందన్నారు. కామర్స్ విభాగానికి చెందిన రజిత వల్లూరి 500 మార్కులకు గాను 483 మార్కులు (96.6) సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. హ్యుమానిటీస్ విభాగంలో లక్ష్మీ సంజన పాండ్రాంగి 477, శ్రీనిధి 475, మైథిలి నంద 472 మార్కులతో తర్వాత స్థానాలోల ఉన్నారన్నారు. ఐఎస్‌సీలో 30శాతం మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 84 శాతం మంది డిస్టింక్షన్ సాధించారని ఓ ప్రకటనలో తెలిపారు.

కొట్టి చంపేశారు.. ఆస్పత్రికి తీసుకువచ్చి వదిలేశారు..

- మృతుడు పశ్చిమబెంగాల్‌కు చెందిన జితేందర్‌గా గుర్తింపు
- సీసీ ఫుటేజీ ఆధారంగా వీడిన మిస్టరీ
- నిందితుల గుర్తింపు



గాంధీఆస్పత్రి అత్యవసర విభాగంలో మృతదేహంతో.. (సీసీ ఫుటేజీ)

చిలకలగూడ: డబ్బుల విషయమై కొట్లాడుకున్నారు. అందరూ కలిసి మూకుమ్మడిగా దాడి చేయడంతో అక్కడిక్కడే మరణించాడు.. ఏమి ఎరగనట్లు గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చి అత్యవసర విభాగంలో మృతదేహాన్ని వదిలి పరారయ్యారు.. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసు చిక్కుముడి వీడగా, ఆటోడ్రైవర్‌కు చేసిన గూగుల్‌పే నంబరుతో నిందితులను గుర్తించారు. చిలకలగూడ సీఐ నరేష్ తెలిపిన ప్రకారం.. ఈనెల 10వ తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత కొంతమంది వ్యక్తులు ఆటోలో గాంధీఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగానికి ఓ యువకుడిని తీసుకువచ్చారు. స్ట్రెచర్‌పై పడుకోబెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. వైద్యులు వచ్చి చూడగా అప్పటికే యువకుడు మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాంధీఆస్పత్రిలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా పసుపు, ఎరుపు, నీలిరంగు టీషర్టులు ధరించిన ఐదుగురు వ్యక్తులు యువకుడిని ఆటోలో తీసుకువచ్చినట్లు తేలింది. ఆటో నంబరు ఆధారంగా సుమారు 250 సీసీ కెమెరాల ఫీడ్‌ను పరిశీలించి గచ్చిబౌలి నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆటో యజమానితో మాట్లాడితే తాను ఆటోను గజేందర్‌కు విక్రయించినట్లు చెప్పాడు. గజేందర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో గచ్చిబౌలి చౌరస్తా వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోను ఆపి మా స్నేహితుడు చావుబతుకుల్లో ఉన్నాడు.. గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లాలి అని ప్రాధేయపడగా తాను అంగీకరించానని, బొటానికల్ గార్డెన్ వెనుక బయోన్ కన్‌స్ట్రక్షన్ వద్దకు ఆటోను తీసుకువెళ్లగా ఐదుగురు వ్యక్తులు ఓ యువకుడిని మోసుకుంటూ వచ్చి ఆటోలో వేశారని, వెంట వారి బ్యాగులు తెచ్చుకున్నారని, గాంధీఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు వద్ద దిగి ఆటో కిరాయి రూ.700 గూగుల్ పే ద్వారా చెల్లించాడని వివరించాడు. గూగుల్ పే నంబరు తీసుకుని సాంకేతిక ఆధారాలతో పరిశీలించగా వెస్ట్‌బెంగాల్‌కు చెందిన లేబర్ కాంట్రాక్టర్ తపస్‌రేగా తేలింది. బయోన్ కన్‌స్ట్రక్షన్ వద్దకు వెళ్లి లోతుగా దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగుచూసింది. లేబర్ కాంట్రాక్టర్ తపస్‌రే వద్ద మృతుడు జితేందర్ రూ.50 వేలు తీసుకుని పనిచేసుందుకు నగరానికి వచ్చాడు. ఆరోగ్యం బాగోలేదని చెప్పి కొన్ని రోజులుగా పనికి వెల్లడంలేదు. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీ రాత్రి కాంట్రాక్టర్ తపస్‌రే మృతుడు జితేందర్‌ను నిలదీశాడు. వాగ్వాదం జరగడంతో వెస్ట్‌బెంగాల్‌కే చెందిన తోటి వర్కర్స్‌తో కలిసి దాడి చేయడంతో జితేందర్ మృతి చెందాడు. భయాందోళనకు గురైన వారంతా కలిసి పథకం ప్రకారం మృతదేహాన్ని గాంధీఆస్పత్రిలో వదిలి స్వస్థలాలకు వెళ్లిపోయారు. ప్రధాన నిందితుడు తపస్‌రేతోపాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నరేష్ తెలిపారు. హత్య జరిగిన ప్రాంతమైన గచ్చిబౌలి ఠాణాకు కేసును బదిలీ చేయనున్నారు. చాకచక్యంగా వ్యవహరించి మర్డర్ కేసును ఛేదించిన చిలకలగూడ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించి రివార్డులు అందజేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి



అమీర్‌పేట హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం కమిటీ సభ్యులతో మంత్రి తలసాని

సనత్‌నగర్: ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. హనుమాన్ జయంతి సందర్భంగా అమీర్‌పేటలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రికి ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఆలయంలో నూతనంగా నిర్మించిన కార్యాలయాన్ని ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఈఓ విఠలయ్య, నాయకులు అశోక్‌యాదవ్, ఉమానాథ్‌గౌడ్, సభ్యులు నరేందర్ రెడ్డి, సత్యనారాయణ, శేఖర్‌గౌడ్, జిత్తు, అనిల్‌యాదవ్, భాస్కర్, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ సినీనటి విజయశాంతి, మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బండ శివారెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. బండ చంద్రారెడ్డి, సికింద్రాబాద్ బీజేపీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, వీరన్న, శారదా మల్లేష్, ప్రభుగుప్తా, జయసుధ శివారెడ్డి, రాము వర్మ ఉన్నారు.

కంటోన్మెంట్‌లో ...

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు తాడ్‌బండ్, తిరుమలగిరి లాల్‌బజార్, టీచర్స్ కాలనీ హనుమాన్, న్యూ బోయిన్‌పల్లి దాసాంజనేయ స్వామి, అన్నానగర్ పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయాల్లో అభిషేకం, తమలపాకు పూజలు, అన్న ప్రసాద వితరణ, ప్రత్యేక పూజలు జరిగాయి. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, బోర్డు చీఫ్ ఇంజనీర్ గోపాల కృష్ణదాస్, జగన్మోహన్ రెడ్డి, సురేష్, సంతోష్, అశోక్, మంజునాథ్, చైతన్య హేమంత్ తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.



తార్నాకలో హనుమాన్ జయంతి పూజలో పాల్గొన్న విజయశాంతి



టీచర్స్‌కాలనీ హనుమాన్ ఆలయంలో .. బోర్డు చీఫ్ ఇంజనీర్ గోపాల కృష్ణదాస్

పద్మశ్రీ డాక్టర్ హన్మంతరావుకు మెల్‌బోర్న్‌లో సన్మానం



మెల్‌బోర్న్‌లో పద్మశ్రీ హన్మంతరావుకు సన్మానం చేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: స్వీకార్ ఉపకార్ రిహాబిలిటేషన్ వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ పి.హన్మంతరావు సేవలకు గాను ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో ఘనంగా సత్కరించారు. మెల్‌బోర్న్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ శారీరక, మానసిక వికలాంగు లకు తమ స్వీకార్ ఉపకార్ సంస్థ ద్వారా అనేక సేవలు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెల్‌బోర్న్ తెలంగాణ ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటు చేసే వరకు పోరాడతాం



దీక్షను ప్రారంభిస్తున్న హరి

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి ఆస్పత్రిని నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 40వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో పాల్గొన్న వారికి పూల మాలలు వేసి బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి ఈ రిలే దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు కనీస వైద్య సౌకర్యం కోసం బస్తీలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బస్తీ వాసులంతా 40 రోజుల నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ వచ్చి ఆస్పత్రి ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో పాల్గొన్న వారికి సాయంత్రం లక్ష్మణ్, సుధాకర్ తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

జీఓ 58, 59లను సద్వినియోగం చేసుకోవాలి



అంబేడ్కర్ నగర్ బస్తీలో సాయన్న చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్: ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదల ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకురాలు లాస్య నందిత అన్నారు. బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, నివేదితతో కలిసి ఆదివారం ఆరోవార్డు పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ తమ తండ్రి, దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆశయాలకు అనుగుణంగా కంటోన్మెంట్‌లో బస్తీల క్రమబద్ధీకరణకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. రక్షణ భూముల్లో వెలిసిన బస్తీలకు క్రమబద్ధీకరణ ద్వారా పట్టాలు ఇప్పించేందుకు సాయన్న ఎంతగానో కృషి చేశాడన్నారు. ఆయన హయాంలోనే పలు బస్తీలకు రక్షణ శాఖ వేధింపుల నుంచి విముక్తి లభించిందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 58, 59 ద్వారా మరో అవకాశం కల్పిస్తోందన్నారు. అంబేడ్కర్ నగర్ వంటి బస్తీల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పనస సంతోష్, నాగేని సరిత, శ్రీకాంత్, జయమ్మ, విష్ణు, వెంకటయ్య, లక్ష్మి, సైదులు పాల్గొన్నారు.

నడుస్తున్న కారులో మంటలు




దగ్ధమైన కారు

రాంగోపాల్‌పేట్: నడుస్తున్న కారులో మంటలు చెలరేగి కారు దగ్ధం అయింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన రవీందర్‌నాథ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఇండికా విస్తా కారులో ఇంటి నుంచి మెట్టుగూడ రైల్వే ఆస్పత్రికి వెళ్లి మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి తిరిగి వెళ్తున్నాడు. ఆయన కారు రైల్ నిలయం ప్రాంతానికి రాగానే కారులో పొగలు రావడంతో ఆయనతో పాటు కుటుంబ సభ్యులను బయటకు దించారు. వెంటనే పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. మంటలకు కారు మొత్తం కాలిపోయింది.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు..

ఆర్పీరోడ్‌లోని మహెబూబ్ కళాశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆదివారం పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తినష్టం జరుగలేదు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వరలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట ప్రకాష్‌నగర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నట్లు స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. దీంతో పోలీసులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చి ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. 108 వాహన సిబ్బంది సదరు వ్యక్తిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. స్థానికంగా పోలీసులు విచారించగా మృతుడి పేరు సనీత్‌గా తెలిసింది. రెండు రోజులుగా మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు డబుల్ ఇళ్లకు నీళ్లు

- నెరవేరిన సాయన్న కోరిక
- సంబురాలు చేసుకున్న లబ్ధిదారులు



సాయన్న కుమార్తెలు లాస్య, నివేదితతో కలిసి సంబురాలు చేసుకుంటున్న డబుల్ బెడ్‌రూంవాసులు

కంటోన్మెంట్: ఎట్టకేలకు సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్‌రూమ్ వాసులకు నల్లా నీళ్లు వచ్చాయి. కంటోన్మెంట్ పరిధిలోనే తొలి డబుల్ బెడ్‌రూమ్ కాంప్లెక్స్‌గా 2016లో చేపట్టగా, దాదాపు రెండేళ్ల క్రితం లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న హయాంలో నిర్మించిన 160 ఇళ్లకు నల్లా నీటి సదుపాయం కల్పించలేకపోయారు. దీంతో స్థానికులు పదే పదే ఆందోళనకు దిగడంతో దివంగత ఎమ్మెల్యే బోర్డు అధికారులతో మాట్లాడి, నల్లా కనెక్షన్‌లు ఇచ్చేందుకు ఒప్పించారు. డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం ఎదుట భారీ సంప్ ఏర్పాటు చేసి, ఒక్కో బ్లాక్‌పైన వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఆచరణ సాధ్యం కాదని భావించిన బోర్డు అధికారులు పనులు కనెక్షన్‌ల జారీలో జాప్యం చేస్తూ వచ్చారు. నెలన్నర క్రితం నల్లాలు ఏర్పాటు చేశారు. తాజాగా ఆదివారం నల్లా నీటిని లాంఛనంగా విడుదల చేయడంతో కాలనీ వాసులు సంబురాలు చేసుకున్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య, నివేదితలను సన్మానించి తమ కృతజ్ఞత వెల్లడించారు. గృహ సముదాయం వద్ద ఇటీవలే ఏర్పాటు చేసిన సాయన్న విగ్రహానికి పాలాభిషేకం చేసి తమకు ఇళ్లు, నీళ్లు ఇప్పించిన మహానేతను ఘనంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో బాలరాజ్, నరేశ్, రఫీక్, అజీమ్, తౌఫిక్, బ్రమన్, యాదన్న, సాగర్, రౌఫ్, రామ్, శంకర్, బాబు, గోపి, రాజు, అహ్మద్ కిశోర్, సబీర్, జాఫర్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు వందనం

ఘనంగా మదర్స్ డే వేడుకలు



మాతృమూర్తులను సన్మానించిన తలసాని సాయికిరణ్‌యాదవ్

సనత్‌నగర్: సృష్టికి మూలం అమ్మ అని, అలాంటి అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువేనని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సికింద్రాబాద్ ఆర్డీఓ వసంత, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈఓ అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో పాటు పలువురు మాతృమూర్తులను సన్మానించారు. శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ పార్థసారథి, దాతలు సుశీల, చంద్రశేఖర్, ముకుందలాల్, రఘురామ్, సమితి సభ్యులు బాలాత్రిపురసుందరి, రాంమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అమీర్‌పేట బుద్ధనగర్‌లో..

అమీర్‌పేట బుద్ధనగర్ కమ్యూనిటీ హాల్‌లో గణేష్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మాతృ దినోత్సవ వేడుకలకు తలసాని సాయికిరణ్ యాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నిర్వాహకురాలు రోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తబితా స్త్రీ శిశు సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో..

లాలాపేట: తబితా స్త్రీ శిశు సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం శాంతినగర్‌లో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ డైరెక్టర్ ఆచార్య అహరోన్, ఏలిషమ్మ, పలువరు స్థానిక మహిళలు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో తల్లులను సన్మానిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ నగర్‌లో..

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం అంతర్జాతీయ మాతమూర్తి దినోత్సవ వేడుకలు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టి. రాజుసింగ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మాతమూర్తులను శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి చీరలను బహుకరించారు ఈ కార్యక్రమంలో దీలిప్,కిషన్,శంకర్ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

తొలగించిన ఓటు హక్కును సాధించుకుందాం



మాట్లాడుతున్న క్రిషాంక్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో తొలగించిన ఓటు హక్కు కోసం అందరం కలిసి ఐక్యమత్యంగా పోరాటం చేసి సాధించుకుందామని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిషాంక్ అన్నారు. తిరుమలగిరి సాయిబాబా హట్స్‌లో క్రిషాంక్ బోర్డు మాజీ సభ్యులు పి. శ్యాంకుమార్‌తో కలసి శనివారం రాత్రి ఎనిమిదవ బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనైతికంగా 35వేల ఓట్లను తొలగించారని అన్నారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారని అన్నారు. కేటీఆర్ లేఖకు మద్దతుగా క్రిషాంక్ స్థానికులతో కలసి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు. అదే విధంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. అనంతరం బస్తీవాసులతో కలసి సహపంక్తి బోజనాలు చేశారు. స్థానిక యువతకు వాలీబాల్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, రాజు, గణేష్, సాయి, శేఖర్, మోని. రఘు తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



పిడమర్తి రవి జన్మదినం కేక్‌ను తింటున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవిది స్థిరమైన స్థానమని పలువురు విద్యార్థి నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట కేక్‌కట్ చేసి పిడమర్తి రవి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ అధ్యక్షులు మేడితపల్లి విజయ్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా పిడమర్తి రవి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను ఐక్యం చేసి పోరాడిన నాయకుడని కొనియాడారు. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్)ను స్థాపించిన పిడమర్తి రవికి సబండవర్గాలు అండగా ఉంటాయని రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్ పేర్కొన్నారు. ప్రసాద్, నరేందర్, ప్రవీణ్, కిషన్, బాలస్వామి,ప్రసాద్, శ్రీశైలం, సెనపతి, సైదులు, శ్రీకాంత్, రాజేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

స్వచ్ఛత, పరిశుభ్రత ప్రతి ఒక్కరి నినాదం కావాలి



గ్రీన్ టీమ్ సభ్యులతో సీఈఓ, బోర్డు మాజీ ఉపాధక్షుడు కేశవరెడ్డి

కంటోన్మెంట్: స్వచ్ఛత, పరిశుభ్రత ప్రతి ఒక్కరి నినాదం కావాలని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. 'టీమ్ గ్రీన్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ రెండో వార్డు మార్గదర్శి కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమానికి బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రీన్ టీమ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీవారం కాలనీల్లో పోగయ్యే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పోగు చేసి, రీసైక్లింగ్ చేస్తున్న విధానాన్ని అభినందించారు. స్వచ్ఛత ఓ నినాదంలా ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ టీమ్ సభ్యులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

అవధాన శిక్షణ శిబిరం విజయోత్సవ సభ



బన్సీలాల్‌పేట్: అవధాన వికాస పరిషత్ భాగ్యనగర్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ అవధాన శిక్షణ శిబిరం–2023 వియోత్సవ సభ ఆదివారం పద్మారావునగర్‌లోని శివానందా ఆశ్రమంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పంచ సహస్రావధాని, తిరుమల తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ.. నన్నయ్య, తిక్కన, పెద్దన, శ్రీనాథుడు, తిరుపతి వేంకట కవులు, ధూర్జటి లాంటి ఎందరో మహాకవులు తెలుగు భాషా వికాసానికి అవధాన ప్రక్రియ నిర్వాహణలో ఆద్యులుగా నిలిచారని పేర్కొన్నారు. కొత్తవారికి అవధానంపై శిక్షణ ఇవ్వడానికి ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. భారత సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవధాన విద్యా వికాస పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ, కార్యదర్శి డా. కెవిఎస్, సీఎం కార్యాలయ ప్రజా సంబంధాల అధికారి వనమా జ్వాలా నర్సింహరావు, డా. బలుసు అపర్ణ, ఆముదాల మురళి, డా. రాంభట్ల పార్వతీశర్మ, తాతా సందీప్ శర్మ తదితరులున్నారు.